# 17358 వద్ద నిరోధం




**సమీక్ష** : ఎఫ్ఐఐల కొనుగోళ్లు, భారీ షార్ట్‌కవరింగ్‌లకు తోడు అంతర్జాతీయంగా సానుకూలతలు కూడా కనిపించడం దేశీయ మార్కెట్లలో బలమైన రికవరీకి దారి తీసింది. యూఎస్ ఫెడరల్ రిజర్వు ఛైర్మన్ బెర్నాంకే వ్యాఖ్యలతో అంతర్జాతీయ మార్కెట్లు లాభాల బాటన సాగడం ఇక్కడా సెంటిమెంటును మెరుగుపరచింది. దేశీయంగానూ లోక్‌పాల్ బిల్లుపై సందిగ్ధం తొలగడం, భారీ షార్ట్ కవరింగ్‌ల వల్ల మార్కెట్‌కు లాభాలు వచ్చాయి. తక్కువ స్థాయిల్లో భారీ కొనుగోళ్లు కనిపించాయి. మరో పక్క జీడీపీ గణాంకాలు అంచనాలకు అనుగుణంగానే రావడంతో మార్కెట్‌కు కలిసివచ్చింది. నెలవారీ గణాంకాల నేపథ్యంలో పెరిగిన వాహన, సిమెంట్ షేర్లు సైతం మార్కెట్‌కు చేయూతను అందించాయి. అధిక ద్రవ్యోల్బణం కారణంగా లాభాలు కొంత తగ్గినప్పటికీ వారం (మూడు రోజులు) మొత్తం మీద సెన్సెక్స్ 972 పాయింట్లు పెరిగింది. 16,821 వద్ద ముగిసింది.

**ఎఫ్ఐఐల పనితీరు** విదేశీ సంస్థాగత మదుపరులు(ఎఫ్ఐఐలు) రూ.1,067 కోట్ల నికర కొనుగోళ్లు చేయగా.. మ్యూచువల్ ఫండ్లు రూ.264.50 కోట్ల నికర కొనుగోళ్లు చేశాయి.

**రంగాల వారీగా** అంతర్జాతీయ మార్కెట్ల రికవరీ నేపథ్యంలో లోహ షేర్లు రాణించాయి. స్థిరాస్తి, బ్యాంకింగ్ షేర్లలో తక్కువ స్థాయిల్లో కొనుగోళ్లు జరిగాయి. విద్యుత్, ఎఫ్ఎమ్‌సీజీ, ఆరోగ్య సంరక్షణ సూచీలు డీలా పడ్డాయి. లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 3:2గా నమోదవడం మార్కెట్లో సానుకూల సెంటిమెంటును సూచిస్తోంది.

**భవిష్యత్ అంచనా** బీఎస్ఈ సెన్సెక్స్ 16433 కీలక స్థాయిని తిరిగి పొందడం చూస్తే స్వల్పకాలంలో ర్యాలీ కొనసాగుతుందని భావించవచ్చు. మార్కెట్ బలహీనంగా ఉన్న నేపథ్యంలో ప్రస్తుత రికవరీ 17300-17400 స్థాయి కన్నా పెరగగపోవచ్చని అంచనా. ఒక వేళ మార్కెట్ కనుక 16433 స్థాయి కన్నా దిగువకు వెళ్తే ప్రస్తుత స్వల్ప కాల ఊర్ధ్వముఖ ధోరణి పూర్తయి పతనం మొదలు కావచ్చు. ప్రస్తుత స్థాయిల వద్దే మార్కెట్ స్థిరీకరణకు లోనైతే ఎంపిక చేసిన షేర్లలో కదలికలను అంచనా వేయవచ్చు.

**ప్రభావిత అంశాలు** అంతర్జాతీయ మార్కెట్ల ధోరణులను దేశీయ మార్కెట్లు సునిశితంగా పరిశీలించొచ్చు. అవి పతనం చెందితే, మన మార్కెట్లూ క్షీణించవచ్చు. ముడి చమురు ధరలపై కూడా మార్కెట్ కన్నేయవచ్చు. దేశీయంగా చూస్తే ఆహార ద్రవ్యోల్బణం కీలకాంశంగా మారనుంది. ఇది మరింత పెరిగితే వడ్డీ రేట్లతో ప్రభావితమయ్యే రంగాలు, అధికంగా రుణాలపై ఆధారపడే కంపెనీలు దిగాలు పడొచ్చు. ఎఫ్ఐఐల కొనుగోళ్లు కొనసాగాయంటే మార్కెట్‌కు మద్దతు లభిస్తుంది. లేకుంటే ఒత్తిడి ఉండవచ్చు.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 16046, 16256, 16550; **తక్షణ నిరోధ స్థాయిలు:** 17135, 17358, 17665

**17358 వద్ద మార్కెట్ బలమైన నిరోధాన్ని ఎదుర్కోవచ్చు.**

– సతీశ్ కంతేటి, జెన్‌మనీ